క్లుప్తంగా

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన



స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న తహసీల్దార్ కె.ఆనందరావు

పార్వతీపురం టౌన్‌: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గం కోసం పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను తహసీల్దార్ కె. ఆనందరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎంల భద్రతకు గదులు, ఆ గదుల భద్రత దృష్ట్యా చేపట్టాల్సిన చర్యల గురించి సిబ్బందిని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కావలసిన ఏర్పాట్లు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌లలో సీసీకెమెరాల ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల నుంచి వచ్చే రూట్‌మ్యాప్, భద్రత తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.

ఏజెన్సీ క్రికెట్ టోర్నమెంటులో 'బారి' విజేత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు దండి శ్రీను

సాలూరు రూరల్‌: మండలంలోని ఏజెన్సీ గిరిజన గ్రామాల్లో ఏటా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంటు ఈ నెల 2వ తేదీన ప్రారంభం కాగా 16 గిరిజన జట్లు పాల్గొన్నాయి. పోటాపోటీగా 10రోజుల పాటు జరిగిన ఈ టోర్నమెంటులో 'బారి' జట్టు మొదటిస్థానం సాధించగా చోర జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ మేరకు గురువారం కొదమ పంచాయతీ చోర గ్రామంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కన్వీనర్ దండి శ్రీను విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. మొదటి బహుమతిగా రూ.10వేలు, ద్వితీయ బహుమతిగా రూ.5వేలు గెలుపొందిన జట్లకు అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సర్పంచ్‌లు మువ్వల ఆదయ్య, చోడిపిల్లి బీసు, మర్రి ఆదయ్య, మెల్లిక బోడి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మక్కువ: మక్కువ సబ్‌స్టేషన్ పరిధిలోని వెంకటభైరిపురం, శంబర, దుగ్గేరు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8గంటలనుంచి, మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీవీ. కిశోర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ మరమ్మతులు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ చార్జింగ్ నిమిత్తం విద్యుత్ సరఫరా నిలుపుదలచేసి, మధ్యాహ్నం ఒంటిగంట తరువాత విద్యుత్ సరఫరా పునరుద్ధరించనున్నట్లు తెలిపారు. ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రత్యేకాలంకరణలో లక్ష్మీనృసింహ స్వామి



సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నది ఒడ్డున వెలసిన లక్ష్మీనృసింహ స్వామి గురువారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానఅర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో భక్తుల దర్శనార్థం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారికి గురువారం ప్రీతికరం కావడంతో ఆలయం చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులతో పాటు జిల్లాలోని పలుప్రాంతాల నుంచి భక్తులు పూజాసామగ్రితో వివిధ రకాల వాహనాల్లో స్వామివారికి మొక్కులు తీర్చుకునేందుకు తరలివస్తారని ఆలయ ప్రధాన అర్చకుడు తెలిపారు. ఉపవాసాలతో దూర ప్రాంతాల నుంచి పూజల నిమిత్తం వచ్చిన భక్తులకు అభిషేకాలు, కుంకుమ పూజలనంతరం తీర్థప్రసాదాల వితరణ చేశారు.

ఆరోగ్య కార్యక్రమాలు పక్కాగా నమోదుచేయాలి

- డీఎంఓ టి.జగన్‌మోహనరావు



బర్లిలో వెల్‌నెస్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంఓ

బలిజిపేట: ఆరోగ్య కార్యక్రమాల వివరాలు పక్కాగా నమోదుచేసి, ప్రగతి నివేదికల్లో పురోగతి సాధించాలని డీఎంఓ టి.జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని బర్లి, మిర్తివలస వెల్‌నెస్ కేంద్రాలను గురువారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గర్భిణుల రిజిస్ట్రేషన్ నమోదు, అర్హులైన జంట వివరాలపై వైద్య సిబ్బందిని ప్రశ్నించారు. ఆర్సీహెచ్ రికార్డులు, ఆన్‌లైన్ నమోదు తీరును పరిశీలించారు. ప్రిజం పక్కాగా అమలు చేస్తూ శిశు ఆరోగ్య శ్రేయస్సు కోసం కృషిచేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ నోడల్ అధికారి వినోద్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఈద్-ఉల్-ఫితర్



సీతానగరం: ముస్లింలకు హితబోధ చేస్తున్న మతగురువు షేక్ రసూల్



సంబరాల్లో ముస్లింలు

- రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ముస్లిం సోదరులు
- ఈద్ ముబారక్ అంటూ ఆలింగనాలు
- మసీదుల్లో ప్రత్యేక నమాజ్

పార్వతీపురంటౌన్‌: పవిత్ర రంజాన్ పర్వదినాన పార్వతీపురం మన్యం జిల్లాలోని ముస్లిం సోదరులంతా గురువారం ఆధ్యాత్మిక చింతనతో గడిపారు. కొత్తదుస్తులు ధరించి..అత్తరు జల్లుకుని ఉదయం 8 గంటలకు ఈద్‌గాలకు చేరుకుని సామూహికంగా ప్రత్యేక నమాజ్ చేశారు. మత పెద్దలు వినిపించిన పవిత్ర ఖురాన్‌లోని దివ్య సందేశాన్ని శ్రద్ధగా ఆలకించారు. నెలరోజుల పాటు చేసిన కఠిన ఉపవాస దీక్ష విశేషాన్ని తెలుసుకున్నారు. సమస్త మానవాళికి సుఖసంతోషాలు కలగాలని, సమస్యలు తొలగిపోవాలని, కుటుంబజీవనం సాఫీగా సాగిపోవాలని, ప్రపంచ శాంతి కలగాలని అల్లాను వేడుకున్నారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ రమజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. రంజాన్ వేడుకల్లో చిన్నారులు సందడిగా గడిపారు. పార్వతీపురం పట్టణంలోని జామియా మసీదులో మత గురువు గులామ్ హైదర్ అలీ మాట్లాడుతూ అల్లా చెప్పిన విధంగా మీ తోటి వారిని ప్రేమించడంతో పాటు వారికి సహాయ సహకారాలను అందించడమే ఒక ముస్లిం చేయాల్సిన పని అని బోధించారు. జీవితంలో మంచి ప్రవర్తనతో మెలగాలని హితవు పలికారు. జాలి, దయం, కరుణ కలిగి ఉండాలని స్పష్టం చేశారు. అనంతరం రంజాన్ ప్రత్యేక నమాజ్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో జామియా మసీద్ ముస్లిం పెద్దలు సయ్యద్ ఇబ్రహీం, సయ్యద్ గౌస్, సయ్యద్ రజాక్, సయ్యాద్ నవి. సయ్యద్ జలాల్ పాల్గొన్నారు.

పొత్తులతో కాదు.. ప్రజాభిమానంతో గెలుస్తాం



ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న అభిమానులు, ప్రజలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

- ఐదేళ్లలో సంక్షేమ పాలన అందించిన వైఎస్సార్‌సీపీ
- ఎమ్మెల్యే అలజంగి జోగారావు
- బందలుప్పిలో మేమంతా సిద్ధం

పార్వతీపురంటౌన్‌: కూటములు, పొత్తులతో కాకుండా ప్రజాభిమానంతో సార్వత్రికఎన్నికల్లో గెలుస్తామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన పార్వతీపురం మండలంలోని బందలుప్పి గ్రామంలో ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, వైఎస్సార్‌సీపీ మండల నాయకులతో కలిసి 'మేమంతా సిద్ధం' కార్యక్రమం నిర్వహించారు. వేలాదిమందితో నిర్వహించిన కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ జగనన్న నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గడిచిన ఐదేళ్లలో సంక్షేమ పాలన అందించిందని, అభివృద్ధిలో పరుగులు పెట్టించిందని చెప్పారు. పేదల సంక్షేమానికి సీఎం జగనన్న అగ్రతాంబూలం ఇవ్వడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందన్నారు. పేదరికమే అర్హతగా పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపికచేసి వారి జీవన ప్రమాణాల్లో సీఎం జగన్‌మోహన్ రెడ్డి పెను మార్పులను తీసుకువచ్చారన్నారు. సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసిన తమ ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయలు పేదల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమచేసి ప్రజల ఆదరాభిమానాలు పొందిందని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు ఒక నమ్మకం, భరోసా కల్పించారన్నారు.

మళ్లీ గెలిపించాలి

గ్రామంలో ఇప్పటివరకూ ఏ ప్రభుత్వం, ఏ ప్రజాప్రతినిధి చేయనంత అభివృద్ధిని తాను చేసి చూపించానన్నారు. రానున్న సాధారణ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని, పార్వతీపురం ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను మీరంతా ఆశీర్వదించి జగన్ మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇచ్చి మన రాష్ట్రాన్ని, మన ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని, అందుకు అందరూ తోడ్పాటు అందించాలని పేరుపేరునా అభ్యర్థించారు. కార్యక్రమంలో నియోజకవర్గం పరిశీలకుడు తూముల భాస్కరరావు, ఎంపీపీ మజ్జి శోభారాణి, వైస్ ఎంపీపీలు సిద్ధా జగన్నాథరావు, బంకురు రవికుమార్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, పీఏసీఎస్ చైర్మన్ కాపారపు సత్యనారాయణ, పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ వి.గురురాజు, పోల సత్యనారాయణ, జేసీఎస్ కన్వీనర్ బి.వాసుదేవరావు, శ్రీనివాసరావు, సర్పంచులు, ఎంపీటీసీలు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెదపెంకిలో జ్యోతిబా పూలే జయంతి



నేతాజీ గ్రంథాలయం వద్ద పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న గ్రామస్తులు

బలిజిపేట: మండలంలోని పెదపెంకి గ్రామంలో నేతాజీ గ్రంథాలయం వద్ద జ్యోతిబా పూలే జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ మేరకు గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవనాయుడు ఆధ్వర్యంలో కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా సంజీవనాయుడు మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు పూలే అని కొనియాడారు. ఆయన నిమ్న వర్గాల హక్కులు, స్త్రీల సాధికారత కోసం, రైతుల కోసం ఎన్నో ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. విద్య ప్రాధాన్యం గుర్తించిన ఆయన స్త్రీల కోసం, అంటరాని కులాల వారికోసం ప్రత్యే పాఠశాలలను ఏర్పాటుచేశారని గుర్తు చేశారు. అటువంటి మహానుభావుడిని స్మరించుకోవడం ఎంతో అదృష్టమని చెప్పారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాస్, దేవాప్రతాప్, ఎస్.రవి, ఎం.వెంకటేష్, జి.శ్రావణ్, పి.పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంతో సేవలు చేరువ



చెముడులో నిర్మించిన గ్రామసచివాలయం



21.80లక్షలతో నిర్మించిన ఆర్‌బీకే భవనం

మక్కువ: మండలంలోని చెముడు గ్రామంలో రూ.42లక్షలతో గ్రామసచివాలయం, రూ.21.80లక్షలతో రైతుభరోసాకేంద్రాన్ని ప్రభుత్వం నిర్మించింది. తమ సమస్యలన్నీ గ్రామసచివాలయం, ఆర్‌బీకేల ద్వారానే పరిష్కారమవుతున్నాయని పంచాయతీ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో రేషన్‌కార్డు, పింఛన్, భూసమస్యలు, ఇళ్ల, వ్యవసాయానికి అవసరమైన ఎరువులు, విత్తనాల కోసం మండలకేంద్రంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి పడిగాపులు కాయాల్సి వచ్చేదని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామసచివాలయం, రైతుభరోసాకేంద్రాల్లో సమస్యలు పరిష్కారమవుతున్నాయని లబ్ధిదారులు, రైతులు చెబుతున్నారు. ప్రజల వద్దకే పాలనంటే ఇదేనని, ఇటువంటి పాలనతో తృప్తిగా ఉన్నామని లబ్ధిదారులు ముక్తకంఠంతో స్పష్టం చేస్తున్నారు.

గిరిజన గ్రామాల్లో రచ్చబండ ప్రత్యేకం



కరాడవలసలో నిర్మించిన రచ్చబండ

సాలూరు:

అనాదిగా గ్రామాల్లో రచ్చబండలకు ప్రత్యేకస్థానం ఉంది. గ్రామం మధ్యలో ఓ పెద్ద చెట్టు చుట్టూ లేదా చెట్టు సమీపంలో గ్రామ పెద్దలు, యువత తదితరులు ముచ్చట్లు చెప్పుకునేందుకు, గ్రామానికి సంబంధించి ఏమైనా నిర్ణయాలు తీసుకునే వేదికలుగా ఈ రచ్చబండలు ఉన్నాయి. కాలక్రమేణా రచ్చబండల ఖ్యాతి తగ్గుతూ వస్తోంది. అయితే సాలూరు మండలంలోని పలు గిరిశిఖర గ్రామాల్లో నేటికీ ఈ రచ్చబండల వద్దకు చేరి పెద్దలు, ప్రజలు చర్చించుకోవడం కనిపిస్తుంది.ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో గిరిజన గ్రామాల్లో రచ్చబండల నిర్మాణం చురుగ్గా జరుగుతోంది.



కరాడ కొత్తవలసలో నిర్మించిన రచ్చబండ



నాడు: శిఖపరువు రోడ్డు



నేడు: గ్రామానికి వేసిన బీటీ రోడ్డు

శిఖపరువు గ్రామానికి బీటీ రోడ్డు

సాలూరు రూరల్‌: మండలంలోని పగులు చెన్నూరు పంచాయతీ శిఖపరువు గ్రామానికి సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డి హయాంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర లక్షలాది రూపాయల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణం పూర్తిచేశారు. ఈ రోడ్డు పనులు జరగకముందు ఏజెన్సీ గ్రామాల ప్రజలు శిఖపరువు గ్రామానికి చేరుకోవాలంటే నానా అవస్థలు పడేవారు. ఇప్పుడు నేరుగా తోణాం గ్రామం నుంచి 3కిలోమీటర్ల బీటీ రోడ్డు శిఖపరువు గ్రామానికి పూర్తికావడంతో గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలుగా రోడ్డు నిర్మాణం కోసం ఎదురుచూసిన సాలూరు ఏజెన్సీ గిరిజనుల కల వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత సాకారం కావడంతో రాకపోకల ఇబ్బందులు తీరాయి.

నిరంతర తాగునీటి సరఫరాకు చర్యలు



తాగునీటి సరఫరాను పరిశీలిస్తున్న మున్సినల్ కమిషనర్ శ్రీనివాస్

పార్వతీపురంటౌన్‌: వేసవిలో మంచినీటి అవసరాలు పెరుగుతాయని దానికి అనుగుణంగా పార్వతీపురం పట్టణంలోని ప్రజలకు నిరంతరాయంగా మంచినీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన పట్టణంలో తాగునీటి సరఫరాను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ వాసులకు వేసవికాలంలో నీటి ఎద్దడి లేకుండా పూర్తి ప్రణాళికలు రూపొందించామన్నారు. తోటపల్లి నేలబావుల్లో క్రమం తప్పకుండా పూడికలు తీయిస్తున్నట్లు చెప్పారు. నీటిని పూర్తిగా క్లోరినేషన్ చేసి సరఫరా చేయనున్నట్లు తెలిపారు. తోటపల్లి రిజర్వాయర్ నుంచి వచ్చిన నీటికి ఇసుక బస్తాలు వేసి బావుల వైపు నీరు మళ్లించడమే కాకుండా ఊట బావుల చుట్టూ ఇసుక బస్తాలు వేసి శుద్ధమైన నీరు బావుల్లో ఇంకేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. పని పూర్తయిన పిదప శుభ్రమైన నీరు బావుల నుంచి తోడి బూస్టర్ పంప్‌హౌస్ వద్ద పూర్తిస్థాయిలో క్లోరినేషన్ చేసి రక్షిత నీరు ప్రజలకు సరఫరా చేసేందుకు చర్యలు చేపడతామని వివరించారు.

ఆటో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్సై జి.సత్యనారాయణ

పార్వతీపురం టౌన్‌: ఆటోలో ప్రయాణించే ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ట్రాఫిక్ ఎస్సై జి.సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన పట్టణంలోని పాత బస్‌స్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించామని తెలిపారు. ఆటో ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆటో డ్రైవర్‌కు సంబంధించి పూర్తి వివరాలను స్టిక్కర్ల రూపంలో ఏర్పాటు చేస్తామన్నారు. ఆటోడ్రైవర్లు పరిమితికి మంచి ప్రయాణికులను ఎక్కించకోరాదని, అలాగే మద్యం తాగి ఆటో నడపడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయరాదని, డ్రైవర్ యూనిఫామ్ వేసుకోవాలని స్పష్టం చేశారు. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ ఆటోలను నడపాలని ఎక్కడపడితే అక్కడ ఆటోలను నిలపరాదని, నిర్దేశిత స్థలంలో మాత్రమే నిలపాలని, ఎవరైనా రోడ్డు భద్రత నియమాలు పాటించకుంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్సై రాజారావు, సిబ్బంది కిశోర్, ఈశ్వరరావు, ఆటో యూనియన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోముఖి నదిపై మినీ బ్రిడ్జి పునర్నిర్మాణం పూర్తి



కొట్టుకుపోయిన వంతెన




గోముఖి నదిపై పునర్నిర్మించిన మినీ వంతెన

సాలూరు రూరల్‌: మండలంలోని తోణాం గ్రామం నుంచి ఏజెన్సీ గ్రామాలకు రాకపోకలు చేసేందుకు గతంలో నిర్మాణం చేసిన గోముఖి నదిపై మినీ బ్రిడ్జి పునన్నిర్మాణం పూర్తయింది. గతంలో నిర్మించిన ఈ బ్రిడ్జి కొట్టుకుపోయిన నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో డిప్యూటీ సీఎం రాజన్నదొర బ్రిడ్జి పునర్నిర్మాణ పనులకు 16లక్షల రూపాయలు మంజూరు చేయించి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి బ్రిడ్జి పునర్నిర్మాణం పూర్తిచేశారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో 7 ఏజెన్సీ పంచాయతీలకు రాకపోకలు సజావుగా సాగుతున్నాయి.

ఊరులా వెలసిన జగనన్న కాలనీ

- మక్కువలో 321గృహాలు
- సొంతింటి కల సాకారమైందంటూ లబ్ధిదారుల సంతృప్తి



మక్కువలో జగనన్న కాలనీ

మక్కువ: మండలకేంద్రం మక్కువలో జగనన్న కాలనీ ఓఊరులా వెలిసింది. సాలూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కల్లా, మక్కువలోనే అతి పెద్ద జగనన్న లేఅవుట్. మక్కువలో 321 జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు మంజూరయ్యాయి. పక్కా ఇల్లు లేని నిరుపేదలకు జగనన్న ఇంటితో సొంతింటి కల సాకారమైందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 121 ఇళ్లు పూర్తికావచ్చి, గృహప్రవేశాలు జరుపుకోగా, మిగిలిన ఇళ్ల పనులు వివిధ దశల్లో చురుగ్గా జరుగుతున్నాయి. గతంలో గాంధీనగర్‌కు చెందిన సుమారు 30మంది లబ్ధిదారులకు సొంత స్థలం, పక్కా ఇళ్లు లేవు. వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మావుడి సోదరుల సొంతస్థలంలో ఇన్నాళ్లు పూరిపాకలు నిర్మించుకుని జీవించేవారు. వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఇళ్లు మంజూరుచేయడంతో వారందరికీ సొంతింటి కల సాకరమైంది.

అభివృద్ధి పథంలో రామాకాలనీ

- కోటి రుపాయలకు పైగా పనులు



నిర్మాణమైన సీసీ రోడ్డు



జరుగుతున్న పార్కు ఆధునికీకరణ పనులు



నిర్మాణమైన డ్రైనేజీలు

సాలూరు: మున్సిపాలిటీలోని రామాకాలనీ సచివాలయం ప్రత్యేకం. ఈ సచివాలయం పరిధిలోనే ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర, మాజీ ఎమ్మెల్సీ జి.సంధ్యారాణి నివాసాలు ఉన్నాయి. వారిద్దరూ ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ, టీడీపీల తరపున వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీలో ఉన్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర ప్రత్యేక చొరవతో కోట్లాది రుపాయల సంక్షేమంతో పాటు కోటి రుపాయలకు పైగా అభివృద్ధి పనులు ఈ సచివాలయం పరిధిలోని వార్డుల్లో చేయించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా కోట్లాది రుపాయల నగదు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశారు. ఈ సచివాలయం పరిధిలో 14,15వ ఆర్థిక సంఘం నిధులు, గడపగడపకు మనప్రభుత్వం, నాడు నేడు ద్వారా సుమారు కోటి రుపాయలకు పైగా నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పైలెట్ వాటర్‌స్కీమ్, తదితర అభివృద్ధి పనులు చేపట్టారు. బుడా ఆధ్వర్యంలో సుమారు రూ.50 లక్షలతో పార్కు ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి.